రక్తపింజెర

సాహు

చలికాలం బయటనిలబడితే దాదాపు ఇరవైనిమిషాల్లో తడిసిముద్దయి వజవజ వెన్నుపొంట వణుకొస్తుంది. గోండోని బతుకుపోరాటమంత దీర్ఘచలిరాత్రి- భయంకరంగా గడ్డకట్టుకపోయిన నిశ్శబ్దం.

అలాంటి భయంకరమైన చలిరాత్రి- చుట్టూ కోటగోడల్లాగా ఎత్తయినకొండల మధ్య నాలుగుగూడాలు- ఆ నాలుగుగూడాల్లో మిగిలినవాటికన్న కాస్త పెద్దదైన గూడెంలో పదిహేను గుడిసెలుంటాయి- ఇప్పుడో అప్పుడో కూలిపోవడానికి సిద్ధంగా ఉండి తలుపు గొళ్ళెంలేక కాటికి కాళ్లుబారజాపుకొని గోండుముసలోళ్ళలాగా గుడిసెలు కూరుకుతున్నాయి. ఏ గుడిసెలోకూడా దీపంలేదు- దీపాలులేకకాదు- దీపాల్లోసమరు లేక- సమరు కొనేందుకు కొత్తల్లేక....

బొగడమీద ఇండ్లంటివే ఓ ఇందిరమ్మో
ఆహా.... బొంగురాల తలుపంటివే
బొగడమీద ఇండ్లేవే ఓ ఇందిరమ్మ
బొంగరాల తలుపులేవే
ఇంటికొక్క బల్బంటివే ఓ ఇందిరమ్మ
ఇండ్లల్ల ఎలుగులంటివే
ఇరువై సూత్రాలంటివే ఓ ఇందిరమ్మో
ఇంద్రలోకం తెత్తనంటివే....

ఈపాట గట్టినవాడెవడోగాని- వాడింతకుముందు ఇలాంటిగూడాన్ని సూసుండాలె, దీపం బెట్టుకోను దిక్కులేనివాళ్ళే ఈదేశంలో కోటానుకోట్లు.

అలాంటి గూడెంలో నడిఝాము తిరిగిపోయింది. ఆకాశంలో చుక్కలు ఆకలికి చచ్చిన శవం కళ్లమాదిరిగా పాలిపోయి వెలుగుతున్నాయి ... గుడిసెలముందు చిటపట లాడుతూ నెగళ్లుమండుతున్నాయి- ఆనెగళ్ల పక్కనే దుమ్ములో ఒంటిమీద గుడ్డన్నా లేకుండా- ఈడ్చుకపోయే కడుపులతో కొందరు నిద్రపోతున్నారు.

చిట్టచివరి గుడిసె శిడాంశిత్రుది.

శిడాంశిత్రు కళ్ళు నెగడుమంటల్లాగా మండుతున్నాయి నిద్రరాదు- మనసును తొలుస్తున్న ఆలోచనలు అంతంకావు. ఆకలిమంట చల్లారదు. నెగడుపక్క ముడుచుక

పడుకున్న బిడ్డను చూశాడు. పాత పంచెబొంత కప్పుకొని కూడా పిల్ల వణుకుతోంది. ఆపిల్ల తువ్వలాంటి వెంట్రుకలు దుబ్బు పీచిపోయున్నాయి.

పిల్ల కాళ్ళు నిగ్గదన్నింది. వెగడులోకాలు- చురుక్కుమన్నది- పిల్ల మొత్తుకున్నది. పిల్లపక్కనే పండుకొన్న తల్లిలేచి మళ్ళీ బిడ్డమీద బొంతకప్పింది. పిల్ల ఏడుపురాక మూలుగుతూ నిదురలోకి జారుకున్నది. శిత్రి కాలిమచ్చలేర్పడిన పెండ్లాం కాళ్ళకేసి చూస్తూ కూర్చున్నాడు కాపేప్పు- విసుగొస్తోంది. దూరంగా వల్లగా భయంకరంగా వినిపించే కొండలకేసి చూశాడు. ఎక్కడో కట్టమీద చలికి వణకుతుదరక పక్షిఏదో బలహీనంగా అరుస్తోంది. లేచి గుడిసెపెల కొచ్చాడు. గుడిసెకన్నాలు- నెత్తికి చూడుకొట్టుకున్నది. గుడిసెను తిట్టాలన్నా ఓపికలేదు- తనకేదన్న పాతపంచెబొంత దొరుకగల దేమోనని ఆత్రంగా వెతికిండు- ఇల్లాకాదల్లేతున్నది. ముఖం చిట్లించి గుడిసెబయట కొచ్చాడు- చలి. ఒళ్ళంతా దరిద్రంలాగా పాకేసింది. "ఉవ్వావ్వా... వ్వావ్వా" దవడలు దప్పులు కొడుతుంటగా వెగడు వెగేసి ముందు కూర్చున్నాడు.

నెత్తిమీద బొప్పికట్టింది- తడిమిచూసుకున్నాడు. "ఇయ్యేడన్నా గుడిసె బాగు చెయ్యాలె" అనుకున్నాడు మనసులో- గుడిసె బాగుచేయాలంటే కర్రిగావాలి- కర్రంటే "అమ్మో శాకిబిడ్డల పోకిదారు" గుర్తొచ్చి వణుకొచ్చింది. చౌకిదారు ఎర్ర కండ్లు- వాడొస్తేనే కోడికావాలంటాడు- కోడి ఇచ్చినా దవడలు విరుగొట్టేదికాయం. దవడలు విరుగ్గొట్టినా పండుగ దబ్బులు తప్పేదిలేదు. సముద్రం తలాపున పెట్టుకొని పావ నీళ్లకేడ్చిన బ్రతుకు- ఇలాంటి పండుగ గుడిసెల్లో పగలు రేయి దరిద్రం తాండవ మాడుతుంది.

వెగడు చిటపటమండుతోంది. ఆ చప్పుడుకు శిత్రపెండ్లాం మల్కాబాయి లేచింది. కనపిన నెత్తిగోకింది.

"నువ్వింకా పండలేదా?" అడిగింది....

మొగడు మాట్లాడలేదు- మాట్లాడటానికేముంది? అమాటలకైనా ఓపికుండాలి గదా! పక్కలకేసి చూసింది- తెల్లారేటట్టులేదు- మొగనికేసిచూసింది. శిత్ర కుడికాలు పాదంలోంచి చీముకారుతోంది- తను పెండ్లయిన దగ్గరినుండి అప్పుడట్లా చీము కారుతూ ఉండటం చూస్తానే ఉన్నది. అదిమామూలే. చలి... మల్కుబాయి వెగడు దగ్గరికి జరిగి "నలి గరీబోల్లని చంపనీకి బుట్టిందో! లేక మీదగానలిల సావుందని మనల గుడ్లలకు తరిమిండ్లో! ఏమో! ఊబతుకు బతుకొద్దు." అన్నది- మల్కాబాయి అది

87

నాలుగోసారి లేవడం- తెల్లరడానికి ఇంకా చాలా రాత్రేవున్నది. గూడెంలో అలికిడేమిలేదు. కొరివిదయ్యాల్లాగా అక్కడక్కడ మంటలు తప్పిస్తే।

సిత్ర చుట్టముట్టిచ్చుకున్నాడు- పొగతోపాటు గొంతుపెకిలి మాటొచ్చింది. "వానపాయె - పంటపాయె, ఇంగనీయవ్వ తిననీకైతె లావుతిప్పలు గాలిపాయె- తక్లీబున్నది బాయి ఎట్లనో ఏందో?" ఆరిపోతున్న చుట్టనుపీల్చి "ఎందుకు పేన్కు (దేవుడు) గిట్లసూత్తాండే బాయి," అని ఆరిపోయిన చుట్ట మళ్లీ ముట్టిచ్చుకున్నాడు.

అతని పెత్తల గోరెడు మాంసం లేకుండా ఆకలితినేసింది- ముప్పయేండ్లకే ముసలోడయ్యిండు- దూరంనుంచి కూడా అతని బరిబద్దబొక్కలు లెక్కపెట్టచ్చు.

"పేన్కుగూడ పెద్దల మజ్జతే ఏంజేద్దాం- అందరుసత్తే మనంసత్తం- అందరు బతుకుతే మనంబతుకుతం. పేన్కుకు తక్కువ పెయ్యకపోతిమి. పెయ్యకట్ట పడని దినంలేదాయె- అందరు బొంగుపనికి బోతరట- మనంపోదాం. పోరనితిస్కపోదాం- ఇంగే దిక్కులేకపాయె- పంటపోతే పటుమని పదికొత్తలిచ్చెటోడు లేకపాయె సర్కారోడు అప్పిత్తడని కాలుకు బట్టకట్టకుంట దిరిగి సేసినకష్టం నూరూపాలు ఆడెవడో బేంకు పెద్దకు లంచమిత్తె ఆకుక్కలకొడుకు బేంకులకుబోతె మెడలుబట్టి బయటికినూకె- అంగట్లకుబోతె షావుకార్లేమొ మీకు బేంకులిచ్చె పౌరకల సార్లచ్చిరని గుర్తిసనబట్టె- సావుకాలమచ్చింది." మల్కాబాయి ఇంకా చాలా చాలా మాట్లాడా లనుకుంది కాని అక్కడికే ఆఖరిమాట నాభిలోనుంచి పెకిలచ్చింది.

కాలేకడుపులోల్లు ఇంతకన్న ఎక్కువేం మాట్లాడుకోగలరు. ఊసులాడ, బాసలాడ ఒంట్లోసత్తువేది. అడివిల జంతువుల్లాగే తప్పనిసరి ఆ సంబంధం- అందులో ఇలాంటి నిదురబట్టని రాత్రిల్లో ఒకటోరెండో మాటలు. ఆమాటలు వాళ్ళ ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకునేవికావు, ఒకరి కష్టసుఖాలు ఒకరు విచారించేవికావు. సూర్యుడు బయటికెలితే గోండోల్లు బయటకు వెళ్ళతారు. ఏతపిపెట్లవెంటో ఏ కంకపొదలల్లోకో జారుకుంటారు. మళ్ళీకలయిక చీకటితోనే....

"మొన్న బొంగు సుప్పరవేజర్ కడగూడెంల పైసలిచ్చిపోయిండు. నూరు రూపాలు తీసుకత్తి- ఇయ్యాల్లినుంచి పనికిబోవాలె. నువ్వేమొ అంగడిబొయి జొండ్లు తెమ్మనబడితివి- నిన్ను సుకపెట్టకపోయినా సూపుకు పీరన్నా లేకపాయె. పెయ్యకనబడవట్టె, నీకో కొత్త చీరతెత్త మల్లబట్యాలకు పొల్లకుసూద్దాం. నేను వాంకిడి అంగడిబోయత్త ఇయ్యాల్ల నువ్వు పోరి పనికిబోండ్లి-" అని మసి మసి

88

తవ్వులు నవ్వుకుంట సుట్ట మల్లముట్టిచ్చుకున్నడు- మల్కాబాయికి రంగు రంగుల సీరెల కండ్లముందు కన్పించినయ్.

అట్లా ఆదంపతులు బతుకుదెరువు ముచ్చెట్లుబెట్టుకున్నరు- ఇంకా ఎల్లబోసుకోని ఎన్నో బాధల్ని కడుపులో దాచుకున్నరు- కండ్లల్ల నీరు కారనీయలేదు- బతుకుమీద ఆశ బహుచిత్రమైంది.

సీకట్లను చీల్చుకొని కొండలనెక్కి- సూర్యుడు బారెడంతరానే వచ్చాడు అయినా పాడువలి ఇంకా వాళ్లను ఒదలనేలేదు.

చలివి తిట్టుకుంటూ శిత్రులేచి ఆవులించి ఒళ్లిరుచుకొని కొంకర్లు బట్టుకపోయిన కాళ్ల చేతులు జాడించాడు- చలిని తిట్టుకుంటూనే ముఖం కడుక్కున్నడు.

నిన్న ఇసిరిన గట్క మల్కాబాయి సీరెసంబరాన వండేసింది- ఎర్రిగారం నూరింది. పిల్ల, సిత్రు మల్కాబాయి తలాబుక్కెడు కడుపులేసుకున్నరు.

అప్పటికే ఉన్నబట్టల్లో మంచియిగట్టుకొని ఎంటికలు సరిదువ్వకొని అడోల్లు అంగడి సంబురాన కూనిరాగాలుదీస్తూ, పొగాకు సంబురాన్నో, జొన్నల సంబురాన్నో మొగోల్లు కాల్లుఎగరేస్తూ- అంగడిపోయే వాళ్ల పోతున్నారు- అంగడే వాళ్లబతుకులో పెద్ద వినోదకేంద్రం- వాళ్ల ఆశలు కలలు కొనుక్కొనేదక్కడే- బతుకు దోసుకోబడే దక్కడే అనేది వాళ్లిప్పుడిప్పుడే తెలుసు కుంటున్నారు.

"ఓర్నియమ్మ లారీలచ్చె- మోటర్లచ్చె. గాడీలచ్చినయటర-" అన్నదెవడో తన తెలివి చూపెడుతూ.

బొంగుపని నడిచినంతకాలం అంగడి మొఖంచూడడానికే వీలుగాదు. బొంగులు కొట్టి- కుప్పలుగట్టి లారీలకెత్తడం లారీలకోసం కొత్తపట్టి రోడ్లు కొండల కడుపుల్ల దాకా వేయడంతోనే సరిపోతుంది- పనిజరుగుతున్నప్పుడు సూపరవైజరే రేషన్ తెస్తాడు. ముక్కినవి మురిగినవి వాళ్లమొఖాన గొట్టి వానిష్టంవచ్చిన ధర గడుతడు- వాడియన్నీ చిత్రిగుప్తుడి లెక్కలు- చిక్కులెక్కలు గోండోల్లకు తెలిసిసావయి.

బొంగుపనికి పోయేవాళ్ళు అంగడిపోయే వాళ్ళకేసి గుర్రిగా, బాధగా చూస్తూ పోతున్నారు- మల్కాబాయి బిడ్డనుతీసుకొని బొంగుపని వాళ్ళల్లో కలిసింది.

ఆలొద్దుల్లో వర్షకాలం తప్ప మిగతాకాలాలల్లో లారీలు దద్దరిల్లుతాయి- ఎనిమిది నెలలు అడివిలో ఏడచూసినా జనమే- ఆ ఎనిమిదినెలలు 'పటుకు పటుకున' గొడ్డండ్లు బొంగు నరికేసప్పుడు విన్పిస్తూనే ఉంటుంది.

"ఏం వేసత్తన్న-" శిత్య అంగడిబోయే మందిలో కలిశాడు.

o o o o

కూలీలంత రోడ్డుపనిచేస్తున్నారు- అడ్డంగాఉన్న చెట్లు, తుప్పలు నరికేవారు నరుకుతున్నారు- బండలు పెకిలించేవాళ్ళు ముక్కుతూ మూలుగుతూ పెకిలిస్తూనే ఉన్నారు. ఒక్కొక్కబండకు గూటనరాలు చిటపటలాడుతున్నాయి. మాగిన కుండల్లాంటి చెత్తల్లోంచి చెమటధారలు కదుతోంది. మట్టిమోసేవాళ్ళు మోస్తూనేఉన్నారు- అట్లా పనిచేస్తున్నవాళ్ళ పనితీరుచూస్తే ఆకాశమార్గం కూడావేసి స్వర్గం చేరేటట్లున్నారు వాళ్ళు వాగులు, వంతలు, బొగడలు సాపుచేసి ఆరోడ్డు పదమటికొండ ఓవరదాకా వేయాలి. అట్లావేస్తేనే కొండమీది బొంగు లారీలకెత్తగలరు- ఒక్కొక్కగ్యాంగులో పది పదిహేను మంది పనిచేస్తున్నారు.

వాళ్ళు అట్లా ఈఎత్తైన పర్వతాల మీదిదాకా రోడ్లుమలిచారు- కొండల్ని లొంగదీశారు- కొండల మీదినుండి తమ చెమటను, నెత్తురును కంకబొంగులల్లో కూరి లారీలకెక్కించారు- పొద్దస్తమానం వంచిన నడుమెత్తకుండా పనిచేయాలి- సూపర్వైజర్ల కోరచూపులు- తన్నులు, తిట్లు, మరింకెన్నో పాడుపనులు జానెడుకడుపు కోసం సహిస్తూ శ్రమిస్తారు- అయినా తిట్లుతప్పవు- దెబ్బలు తప్పవు.

మల్కుబాయి తన కూతురుతోసహా దోబిగ్యాంగుతో పనిచేస్తోంది- దోబి జిగి వచ్చిన ముసలివాడు- బండ పెకలించడానికి వంగినవాడు కాసంత ఆసర బట్టేసరికి వాడిముఖం కమిలిపోతుంది.

మల్కుబాయికి ఇవ్వాళ్ళ గాలిలో తేలిపోతున్నట్లుగా ఉన్నది- కదుపులో ఆకలి కన్నా ఆమె మెదట్లో చీరకదులుతోంది- చీరకట్టినట్లు కొంగు ఛాతీకడ్డంగాదీసి వెనక్కి చెక్కుకున్నట్లు-

"అరె! దోబిమామ జెర చెట్టుకింద కూకోరాదు-" అన్నాదెవడో-

ఆదే అదనుగా దోబి చెట్లగుబుర్లలోకి వెళ్ళిపోయాడు.

ఇంతలోనే దూరంగా జీబుఆగిన చప్పుడు- కూలోల్లల్లో సంచలనం- సూపర్వైజర్ శర్మ జీబుదిగి రాజశీవితో కూలోల్లదగ్గరికొచ్చాడు.

"గుంటనక్కగాదత్తాండు-" ఎవడో ఆదుర్దాగా భయంగా గొనిగిండు.

ముకద్దమ్‌ను పిలిచి "ఎందరు పనికివచ్చారా?" బొంగురు గొంతుతో నిర్లక్ష్యంగా అడిగిండు.

మొఖద్దమ్ మందినిచూసి పేర్లుచెప్పసాగిండు. శర్మ జేబులోనుండి చిట్టాతీసి చూసుకున్నాడు. అడ్వాన్సుతీసుకున్న ప్రతి కుటుంబంనుండి మనుషులొచ్చారు కాని, జుగ్నాకబొజ్జు రాలేదు....

శర్మముఖం క్రూరంగామారింది. "సదువ్‌బే.... ఇద్దర్నితీసుకోపో పోయి వాన్ని ఈడ్చుకరాపో.... ఏమనుకున్నడో" అరిచిండు.

"వాని కంతు జెరం" అన్నాడెవడో శర్మ ముఖంచూడకుండానే.

"లం.... నకురాలు అడ్వాన్సుదీసుకోగా లేంది ఇప్పుడే వచ్చిందా?" తప్పదని మొఖద్దమ్ మనుషులతో గూడెంకేసి నడిచాడు.

"పనిదొంగలు. గోండులం.... కొడుకులనమ్మొద్దు" తిట్లతో అక్కడివాతావరణం చెడిపోయింది

అప్పుడే నీల్లుదాగి చుట్ట ముట్టించుకొని ముసలిడోబి శర్మకంట బడవేపడ్డాడు.

"గోండులం.... కొడుకుల్లారా మీఅమ్మలు పుట్టేటప్పుడే సుట్టల్ని మిమ్మల్ని కన్నారా?" అని డోబిని తన్నబోయాడు. డోబి వనుకుతూ వంగి వంగి దండం బెట్టాడు.

అప్పటికి శర్మకు అలుపొచ్చింది. తిట్టుకుంటూనే గ్యాంగు పనితీరుచూసి విప్ప చెట్టుకిందికి చేరుకొని సిగరెట్టు ముట్టించాడు.

"ఆశమ్మ అదేంది?" మల్కాబాయికి శర్మ తాగేదానిపేరు యాదికిరాలేదు.

"సికిలేటంటరుబాయి" అన్నాడుడోబి.

"అదిగది- సికిరేటుతోగన్నదేమొ?" అన్నది.

నవ్వాలనుకున్నవాళ్ళు ఓపికలేక నవ్వలేకపోయారు. ఇక్కడ పనిసాగుతూనే ఉన్నది.

గూడెంవెళ్లిన మొఖద్దమ్ వలక్కడిజంగు జ్వరంతో పాతగోనెసంచులకింద వనుకుతున్న బొజ్జును బతిమిలాడుకున్నాడు- పనిదాకావచ్చి సూపర్‌వైజర్‌కు మొక్కుదువు రమ్మన్నాడు- బొజ్జును తీసుకవెళ్ళకపోతే జంగుకుతన్నులు- తనతన్నులు తప్పించుకోవాలంటే అట్లా వనుకుతున్న బొజ్జును శవంగానైనా మోసుకెళ్ళాల్సిందే. సూపరవేజర్ల ఖానూండ్లు కోపతాపాలు జంగుకుబాగాతెలుసు- ఇప్పటికి పదేండ్లనుండి ఇలాంటివెన్నో తను చూస్తూనేఉన్నాడు- అతని కళ్ళముందే ఎందరి వీపులమీదనో కంకబరిగెలు విరిగాయి- ఎందరో గిలగిలతన్నుకుంటూ మట్టిలోపొర్లారు- ఇన్నాళ్ల

బొజ్జువంతు- రేపు మరొకడు.... జ్వరంరాకమానదు- అందునా ఈ వనుకుజ్వరం అందరికీవచ్చేదే.... జ్వరంతోటి చావకతప్పదు. ఆ జ్వరానికి కారణం గోండులు పేన్కుడు కోపంరావడంగా నిర్ణయించుకుంటారు- దేవరకొలుపులు- కొలుపులకు అప్పులు- అది పుట్టనప్పుడు జాగా మంచిదిగాదని ఆ గూడాన్ని ఎత్తేసి ఆ నాలుగు కొండలమధ్యనే మరోదగ్గర మళ్ళా గుడిసెలువేస్తారు- చౌకిదారు ఒళ్ళుచీరుతాడు- దండుగలంటాడు. కోళ్లు ఎత్తుకపోతాడు.

వనికేబొజ్జును వెంటతీసుకొనివస్తున్న జంగు ఎట్లామెదులుకోవాలో చెప్పు కొచ్చాడు- బొజ్జుకు ఆమాటలు వినపడటంలేదు మార్గం కనబడటంలేదు- అంతా ముద్దముద్దగా కనిపిస్తోంది- తనను పట్టుకున్న చేతులవేడితప్ప మిగతాఅంతా చలి.... వనుకు.

ఆలిశ్యంఅయ్యిందని శర్మ వెర్రెత్తిపోతున్నాడు- ఆ ఆలిశ్యం మందుకు కావచ్చు- పజాచేయడానికికావచ్చు- అదే శర్మలో కంపరంపుట్టిస్తోంది.

అల్లంతదూరంలో బొజ్జునుచూసి ఉగ్రుడయ్యాడు. ఇంకేముంది పులి మేక పిల్లను చూసింది- బొజ్జు ఒళ్ళు హూనమయ్యింది. శర్మ గర్జించాడు. గాండ్రించాడు.

"ఎవడైనా అడ్వాన్సుతీసుకొని రాకపోతిరో ఇదేగతి మీకుపడుతుంది-" అని కిందబడిన బొజ్జునుచూపించాడు. గోండుభాషలోనే ఈమాట చెప్పింది.

కింద అచేతసంగాపడిఉన్న బొజ్జును అందరు చూస్తూనేఉన్నారు- కళ్లల్లో నీళ్ళు కళ్లల్లోనేఉన్నాయి- గొంతులోనిదుఃఖం గొంతులోనేఉన్నది. నిజంగావాళ్ళకు కోపం వస్తే సూపర్వైజర్ను రోడ్డుమట్టితో కప్పేవాళ్ళే- కాని రాలేదు. ఒకరిద్దరికి వచ్చిన కోపాన్ని దిగమింగుకున్నారు- అట్లాంటివాళ్ళల్లో మల్కుబాయి, ఆవిడకూతురుఉన్నారు.

బొజ్జును తీసుకవెళ్లమని జంగుకు సైగచేశాడు- జంగు మరోఇద్దరు బొజ్జును లేపుకొని చెట్లల్లో మాయమయ్యారు.

"బొజ్జుమామ పనికిరానన్నడా ?" పిల్ల అడిగింది.

"నీకెందుకుబాయి" డోబి గుసగుసగా.

శర్మ గడియారాన్ని చూసుకొని గ్యాంగుల కేసినడిచిండు.

"బొజ్జుమామకు జెరమచ్చిందా ?" మళ్లీ పిల్ల.

ఆపిల్ల కెవలు జవాబు చెప్పలేదు.

"పైసలిత్తె కొట్టాల్నా." మల్కుబాయి.

"కొట్టాల్నని ఏ ఖానూండ్లు రాసిండ్లు" ఇంకొకడు.

దాదాపు ఈప్రశ్నలు అందరు వేసుకున్నారు- వాళ్ళ గతజీవితాన్ని తవ్వివోసుకున్నారు.

"తిట్లుతప్పయి- తన్నులు తప్పయి- మనబతుకు గింతే- బొంగు కట్టలు చిన్నగున్నయంటడు- సన్నటి బరిగెలే కొట్టిండ్లంటడు- పాసింగుల (బొంగు కట్టలు లెక్కపెట్టడంలో) సగం బొంగులు తీసేస్తడు-" బంటఎత్తి రోడ్డుమీదవేస్తూ డోబి గొణిగిండు- పిల్ల నోట్లొదాకావంగిన డోబి నరిసిన మీసాలు కదలడం చూస్తోంది.

"సర్కారు జెప్పిన కూళ్ళన్న ఇచ్చిసావడాయె" అన్నాడెవడో- ఈమాటకు వాన్ని అందరు చిత్రంగా చూశారు.

"తేల్లుంటయి బాయి- మెల్లగతియి." అన్నాడెవడో పిల్లనుద్దేశించి.

ఇట్లా వాళ్ళ బతుకులు తవ్వుకుంటూ రోడ్డుపనిచేస్తుండగా,

పెకిలించాల్సిన పెద్ద బండొకటి మిగిలిపోయింది. నలుగురు బండచుట్టుచేరి ఊపిచూశారు- కాని అది ఊగలేదు.

"రాండ్లెహేఁ రాండ్లి-" బండను పెకిలిస్తున్నవాళ్ళు మిగతావాళ్ళను పిలిచారు.

అంతా పదిహేనుమంది బండచుట్టు మూగారు.

ఊపిర్లుబిగబట్టి "హైసా.... ఊఁ.... పట్టుండ్లిర- పట్టుండ్లి మల్కబాయి కాలు జెగర్త-" మాటలతో అందరు ఒక్కుమ్మడి బండ పెకిలించారు.

అందరి కళ్ళు బండమీదనే- కాని బండకింది రక్తపింజర (అతిప్రమాదకరమైన ఒకరకం పాము) మల్కబాయి పాదంకేసి జరజర పాకింది- కాటేసింది.

"పురుగుముట్టిందిరో-" మల్కబాయి కేకేసి దబ్బున కిందబడిపోయింది.

"చంపుండ్లి-" అరుపులు.

మల్కబాయి నోట్లోనుంచి నురుగులు- శరీరం రంగుమారిపోయింది. పిల్ల మిడిగుడ్లేసుకొని పిచ్చిదానిలా తల్లిని చూస్తోంది.

అందరిలో భయం- అందరు మల్కబాయిని చెట్లకిందనుండి మోసుకొని గూడానికి తీసుకొచ్చారు- పాము కరిసినచోట వాళ్ళకు తెలిసిన పసర్లుబోశారు- పరధాన్లవాడు మంత్రాలు పిటపిట చదువుతున్నాడు.

నాగురావ్ ఎటో ఉరికి పాములవాడిచ్చిన తేజాబు (ఆమ్లము) తీసుకొచ్చాడు.

అప్పటికే సంగతి తెలిసి శర్మ మంది దగ్గరకొచ్చాడు.

"అదేం బతుకుతుందిరా. మీరేదోమందుబోస్తున్నరు- పిసగోండోల్లు ఏదీ మందిటుదేండ్లి" అన్నాడు.

నాగురావ్ తెచ్చియిచ్చాడు.

శర్మ ఎడంచెయ్యి మట్టమీద పోసుకున్నాడు- ఉచ్చబడ్డది. మట్టంతా బుసబుస పొంగింది- లబడడిబడ మొత్తుకుంటూ, గొండోల్లను కసితీరా తిడుతూ గూడెంలో తానుండే బంగ్లాకు ఉరికాడు.

ఎన్నిపోసినా మల్కుబాయి మాత్రం చచ్చిపోయింది.

భయంకరమైన నిశ్శబ్దం గూడెంలో వ్యాపించింది. గూడెంగూడెం సడీసప్పుడు లేకుండయిపోయింది.

ఆకాశంలో చుక్కలు మల్కుబాయి పచ్చబారిన కండ్లలాగా భయంకరంగా ఉన్నాయి అంగడి నుంచి శిత్ర గూడెం చేరుకున్నాడు.

చనిపోయిన మల్కుబాయి శవం గుడిసెముందు. పిల్ల కడుపుల పేగులుబయట కొచ్చేలాగా ఏడుస్తోంది.

చీకటినిచీలుస్తూ గూడానికి దూరంగా చితిమండుతోంది- చితిమంటల వెలుగులు చెట్లకొమ్మలమీద ప్రతిఫలిస్తున్నాయి- పెద్దపెద్దడోల్లు మోగుతున్నాయి.

గొండోల్లు విషాదంగా నృత్యంచేస్తూ పాడుతున్నారు- చనిపోయిన తరువాత అట్లాచేయడం వాళ్ళ ఖాయిదా (ఆచారం)

నిమ్మెపాసి సిల్లేబాయి (నువ్వు సావలేదుబాయి)
జొకీరు కంపినీతూరే (సంపింది కంపినోడే)
నిమ్మెతోడివెడ్డివెకనే (నువ్వుమట్టిపొయ్యకుండా)
ఓనలారి తాకోబాయి (వానిలారి నడువబోదే)
నీవేపాపు లాక్పిబాయి (నీపావంతాకివాడు)
ఓరుసాంతోరు కరలేబాయి (వత్తాడు సత్తెంబాయి)

ఇంకా ఇట్లాగే విన్నుచంపి నీపిల్లలకు విషంబెట్టాడనీ, వేరుగా స్వర్గం చేరుకోవాలని, దుష్టశక్తులేవీ నీ ఛాయలకే రావద్దని, తెల్లవార్లు పాటలుపాడుతూ డోల్లు వాయించారు.

శర్మ మాటిమాటికి పొక్కినచెయ్యి చూసుకుంటూ దిగాలుపడి కూర్చుండి గ్లాసుమీదగ్లాసు విస్కీతాగుతున్నాడు- అతనికళ్ళు మూతలుపడుతున్నాయి- డోల్ల చప్పుడు భయంకరంగా విన్పిస్తోంది.

ఇంకా చీకటి చీకటిగ ఉండగానే గోండుగూడాల కూలీలంతా సూపర్‌వైజర్ ఉంటున్న ఊరికివచ్చారు- ఊరంటే పెద్దఊరేంగాదు- రెండువందల ఇండ్లుంటాయి- ఆ చుట్టుపక్కల అదేపెద్దఊరు ...

శర్మ బారెడుపొద్దెక్కినంక లేచిండు- ముఖంకడిగి స్నానంచేసి టిపిన్‌చేసి బయటకొచ్చాడు- అతని ఎడంచేతికి కట్టున్నది. కూలీలు చాలాదూరంనుంచి సద్దులు కట్టుకొని వచ్చారు.

అప్పటికి పదిహేనురోజుల పనిజరిగింది. గూడాల్లోంచి ఇంటికి ఇద్దరు ముగ్గురు కూలీపైసలు రావాల్సినవాళ్ళున్నారు. అక్కడికొచ్చినవాళ్ళు దాదాపు రెండువందల పై చిలుకేఉంటారు.

శర్మ లెక్కలుతీసిండు- అడ్వాన్సు ఇచ్చేటప్పుడు కూలి మొగకూలికైతే 4-50 ఆడకూలికైతే 3-50 పైసలుగా ఖరారుచేసిండు- ఇప్పుడు లెక్కలుకట్టింది మొగకూలికి 4 రూపాయలు ఆడకూలికి 3 రూపాయలు.

గోండోల్లల్లో గొణుగుడు షురువయ్యింది.

"గిది అన్యాయెం" అన్నాడు శిత్రు.

అంతా "కాదామరి" అన్నారు.

ఒకస్త్రీ తీసుకున్న డబ్బులు శర్మ ముఖంమీదకొట్టింది.

శిత్రు శివంపూనినవానిలాగా పెద్దగొంతుతో "మమ్ముల ముంచుతండ్లు- ఇట్లయితే మేం పనులుచేసేదిలేదు-" మొత్తుకున్నాడు. అతని పిడికిల్లు బిగుసుకున్నాయి కండ్లు మండుతున్నాయి. అదెక్కడికోపమో శిత్రుకేతెలియదు. దోబి చిత్రంగా శిత్రు పిడికిలికేసి చూస్తున్నాడు.

"మీకు ఇంతకన్నా ఒక్క నయాపైస ఎక్కువిచ్చేదిలేదు- ఎక్కడ ఫిర్యాదు చేసుకుంటరో చేసుకోపోండ్లి" అంటూ నిప్పుతొక్కిన కోతిలాగా కాసేపుఎగిరి ఇంట్లోకి వెళ్ళి బట్టలేసుకొని బయటకొచ్చి జీబులోఎటో వెళ్ళిపోయాడు.

కూలీలంతా తలోవిధంగా మాట్లాడారు- సాయంత్రం దాకా శర్మరాగలడేమోనని ఎదురుచూశారు- తెచ్చుకున్న సద్దులుతిన్నారు.

సాయంకాలం శర్మ మరింకరాడని నిర్ణయించుకొని ఎవరి గూడెంవాళ్ళు పోతున్నారు. దారిపొడుగుతాతిట్లే-కొందరు ఊరుపేరు లేకుండా, మరికొందరు శర్మను పేరుపెట్టే తిడుతున్నారు

పైగూడెం సితికాయి "మనం పదేండ్లబట్టి సేత్తనం అనుకున్న మాటమీద కూలీలెన్నడు ఇయ్యలే- అవి తాతసొమ్మా! అదేమన్న పుక్యానికిత్తండా! ఇత్తదో సత్తదో సూద్దాం- ఈపారి అనుకున్నకూలి యిచ్చేదనుక పనులకు వెల్లద్దు" అన్నది.

"నిచ్చమే నిచ్చమే" అన్నారంతా.

ఆ మందలో ఆడవాళ్లే ఎక్కువమందున్నారు.

శిత్ర గూడెం చేరుకునేటాల్లకు రాత్రియిపోయింది. ఎవరూ ఇండ్లల్లోకి వెళ్లకుండా శిత్ర గుడిసెముందు పెద్దనెగడు బెట్టికూర్చున్నారు. "ఏమయ్యిందేమయ్యిందని" గూడెంలో ఉన్నవాళ్లు వచ్చారు.

నాగురావ్ ఏదో ఎర్రికాయిదం తెచ్చిండు- అతనికి కొద్దిగా చదవడంవచ్చు.

"ఎక్కడిదిరా కాయిదం" అన్నారంతా.

"ఇయ్యల్ల సంఘపోల్లచ్చిండ్లు- కంపినోళ్ళు మనల దోసేసంగతి చెప్పిండ్లు. ఇగో గీ కాయిదంలో సర్కారుచెప్పిన కూలిరేట్లుసుత ఇత్తలేరని రాసిండ్లు" అని తట్టుకుంట తట్టుకుంట కాయిదం చదువసాగిండు.

నెగడి మండుతోంది చిటపట - పటచిట- గోండోల్ల కండ్లుమండుతున్నాయి.

o o o o

అడివి నిశబ్దంగా ఉన్నది- బొంగుకోసమొచ్చిన లారీలు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. లారీల డ్రైవర్లు, క్లీనర్లు చెట్లకింద కూర్చుండి పత్తాలాడుకున్నారు. అడివిలో గొడ్డండ్ల సప్పుడులేదు లారీలు బుర్రిబుర్రిలు లేవు.

గోండోల్లు పనిబందుబెట్టారన్నవార్త శర్మకు మధ్యలోనే తెలిసింది. జీబును అటునుండటే పోలీసుస్టేషన్‌కు తిప్పాడు. "లంజకొడుకుల ఓసారి తన్నితేగాని బుద్ధి రాదు-" అనుకుంటూ లోపటచొచ్చాడు.

అమీన్‌కు తన చేతికట్టు విప్పిచూయించాడు- పుండింకా పచ్చిపచ్చిగానే ఉన్నది. గోండోల్లు, సంఘపోల్లుకలిసి తనను కొట్టారన్నాడు. ఏదోమందు చెయ్యిమీదపోశారన్నాడు- పని బందుబెట్టారన్నాడు- చర్యతీసుకోకపోతే పాణాలే తీస్తారన్నాడు. కండ్లల్లో భయంతెచ్చుకున్నాడు. ఖర్చులకుండనీయుండ్లి అని అయిదువందలు తీసి అమీన్ జేబులో కుక్కాడు.

ఇంకేముంది: పోలీసులు గూడాలమీదపడ్డారు. కనపడ్డవాళ్ళనల్లా కసిగాకొట్టారు కనపడ్డ కోడిపిల్లను ఎత్తుకపోయారు- కనపడని సంఘపోల్ల గురించి అడిగారు.

"పొరకలసార్లను మీరుదాచ్తుండ్లు- మీఅందర్ని తుపాకులుపేల్చి సంపుతం" అని బెదిరించారు.

గుడిసెలు తొక్కి, కుండలు తొక్కి, బొబ్బలేసి- చిలచిల నెత్తుర్లు కారంగ అందరినికొట్టి యమలోకాన్ని సృష్టించి చివరకు కొందరికి పగ్గాలుకట్టి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు అందులో శిత్ర ఉన్నాడు.

శిత్రబిడ్డ వెంటబడ్డది- దోబి భార్య గుంజుకపోయింది.

ఇప్పుడు వాళ్ళకళ్ళల్లో మల్కుబాయి చితిమంటలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు వాళ్ళకళ్ళల్లో జ్వరంతో వనికిపోతున్న బొజ్జా కమిలిపోయినఒళ్ళు- ఇప్పుడు వాళ్ళకళ్ళల్లో వందలసంవత్సరాల యమబాధలు గాయాలు, మచ్చలు. ఇప్పుడు వాళ్ళకళ్ళల్లో పోలీసులు చేసిన దౌర్జన్యం రేపిన కోపం.

తెలుగునవలా సాహిత్యానికి ఉత్తమమైన సాంప్రదాయం, చరిత్ర ఉన్నాయి. కందుకూరి వీరేశలింగం, ఉన్నవ లక్ష్మినారాయణ, గుడిపాటి వెంకటచలం, కొడవటిగంటి కుటుంబరావు, త్రిపురనేని గోపీచంద్, రాచకొండ విశ్వనాధశాస్త్రి మొదలైనవాళ్లు ఈ సాంప్రదాయానికి చెందినవాళ్ళు. ప్రజాజీవనాన్ని వివిధకోణాలనుంచి దర్శించి, ప్రదర్శించిన రచయితలువీళ్ళు.

ప్రజాజీవితాన్ని, పోరాటాల్ని సమర్థంగాచిత్రించే నవలలకు ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. ఆరకమైన నవలల కొరతఉన్నప్పుడే అవాంఛనీయ ధోరణులు విజృంభిస్తాయి.

అభివృద్ధికాముకుల ఆదరణమీదఆధారపడ్డ ఎచ్‌బిటి ప్రజాజీవిత, ప్రజా పోరాటాల చిత్రణకు ప్రాధాన్యమిచ్చే నవలలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో నవలలపోటీని నిర్వహించ దల్చుకున్నది. ఈనాటి సమాజంలో తెలుగుదేశపు ప్రజలబాధల, గాధలనుచిత్రిస్తూ వాళ్ళకు ఆశాజనకంగాఉండే సందేశాన్నందించే నవలలను బుక్‌ట్రస్టు తరపు నఆహ్వానిస్తున్నాను. ఇంతకుపూర్వం వెలుగుచూడని వర్గాల జీవన సరళిని చిత్రించే రచనలను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నాను.

ఉత్తమ నవలకు మొదటి బహుమతి రూ. 2500/-, రెండో బహుమతి రూ. 1500/- ఇయ్యటానికి నిర్ణయమయ్యింది. రచన 1982 మార్చి నెలా ఖరులో బుక్‌ట్రస్టుకు అందాలి. పోటీకి సంబంధించిన నియమావళికోసం ఈ క్రింది అడ్రసుకు రాయండి.

చేకూరి రామారావు

హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 3-6-694, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ 500 029.